ఆభరణాల అలంకరణ



చెన్న బసవేశ్వరుడి ఆభరణాల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, ఫిబ్రవరి 11: చెన్న బసవేశ్వర వెండి ఆభరణాల అలంకరణ మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. పట్టణ పురవీధుల గుండా మేళతాళాలు, భజనలతో భక్తులు ఆభరణాల ఊరేగింపు నిర్వహించారు. ఊరేగింపులో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పటాన్‌చెరు అయ్యప్ప భజనమండలి ఆధ్వర్యంలో భజనలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఇన్సూరెన్స్ చెక్కు అందజేత

బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, ఫిబ్రవరి11: బీఆర్ఎస్ సభ్యత్వం ద్వారా మంజూరైన ఇన్సూరెన్స్ రూ.2లక్షల చెక్కును ఆదివారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి బాధిత కుటుంబానికి అందజేశారు. హత్నూర మండలం బడంపేట గ్రామానికి చెందిన కలాలి నారాగౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో బీఆర్ఎస్ పార్టీ ఇన్సూరెన్స్ ద్వారా మంజూరైన చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటుందన్నారు. పార్టీ సభ్యత్వం నమోదు చేసుకున్న ఎంతోమంది కార్యకర్తల కుటుంబాలకు పార్టీ ఇన్సూరెన్స్ చేయించడంతో నేడు ప్రమాదవశాత్తు మృతిచెందిన వారికి ఆర్థికభరోసా ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సింహులు, జడ్పీటీసీ ఆంజనేయులు, పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, సురేందర్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మల్లికార్జున స్వామి కల్యాణం

బొల్లారం ఫిబ్రవరి 11: బొల్లారం మున్సిపల్ పరిధిలో మల్లికార్జున స్వామి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. ఆదివారం మల్లికార్జున స్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ఆలయ పోషకులు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో పట్టువస్త్రాలు సమర్పించి కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఆవరణలో నిర్వహించిన అగ్నిగుండాల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో కొనసాగింది. జాతరలో ఆలయ పోషకులు హనుమంత్‌రెడ్డి, యాదిరెడ్డి, వరప్రసాద్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిగుండాలను తిలకిస్తున్న ఆలయ పోషకులు చంద్రారెడ్డి, హనుమంత్‌రెడ్డి

అర్హులందరికీ ఆరు గ్యారెంటీలు

- విద్యార్థులకు మెరుగైన విద్యను అందజేస్తాం
- మునిపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం
- రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- రూ.28కోట్లలతో అభివృద్ధి పనులు ప్రారంభం



కంకోల్‌లో 30 పడకల దవాఖానను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

మునిపల్లి, ఫిబ్రవరి 11: కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారెంటీలను అర్హులందరికీ అందజేస్తామని వైద్యారోగ్య, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఆదివారం మునిపల్లితోపాటు మండలంలోని బుధేరా, కంకోల్, పెద్దచెల్మడ, తాటిపల్లి గ్రామాల్లో మంత్రి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారెంటీలు అర్హులకు అందుతున్నాయా లేదా తెలుసుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. ఆదర్శ పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మునిపల్లి మండలాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. రూ.రెండు కోట్లతో మునిపల్లి ఆదర్శ పాఠశాలను అభివృద్ధి చేస్తామన్నారు. బుధేరా మహిళా డిగ్రీ కళాశాలలో సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.60లక్షలు, కళాశాల లైబ్రరీలో పుస్తకాలు, కంప్యూటర్లను ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. తాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో రూ.37లక్షల అభివృద్ధి పనులను, పెద్దచెల్మెడ జిల్లా పరిషత్ పాఠశాల నిర్మాణ పనులను మంత్రి ప్రారంభించారు. హాస్టళ్లలో ఉంటున్న ప్రతి విద్యార్థి బాగా చదువుకోవాలన్నదే ఏకైక లక్ష్యమని మంత్రి దామోదార రాజనర్సింహ పేర్కొన్నారు.

కంకోల్లో 30 పడకల దవాఖాన

మండలంలోని కంకోల్‌లో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ 30 పడకల ప్రభుత్వ దవాఖానను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కంకోల్‌లో ప్రభుత్వ దవాఖాన నిర్మించడంతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తాటిపల్లి గ్రామం నుంచి మక్తక్యాసారం వరకు సుమారు రూ.22కోట్ల నిధులతో బీటీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. మునిపల్లి ఆదర్శ పాఠశాలతోపాటు బుధేరా మహిళా డిగ్రీ కళాశాల, తాటిపల్లి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలల అభివృద్ధి కోసం పెద్దమొత్తంలో నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు.

ప్రభుత్వ భూములను రక్షించాలి

మండల పరిధిలో ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. బుధేరా మహిళా డిగ్రీ కళాశాల నిర్మాణానికి గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం 20 ఎకరాల ప్రభుత్వ భుమిని మంజూరు చేసిందన్నారు. అధికారులు సర్వే చేసి 20 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించి హద్దులు ఏర్పాటు చేసి డిగ్రీ కళాశాల చుట్టూ ప్రహరీ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మహా పడిపూజ

బొల్లారం, ఫిబ్రవరి 11: మహా శివరాత్రిని పురస్కరించుకొని శివస్వాములు చేపట్టిన మండల దీక్షలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. మున్సిపాలిటీ పరిధిలోని కేబీఆర్ కాలనీ భవాని శంకరసాయి ఆలయంలో ఆదివారం శివస్వాములు మహా పడిపూజ నిర్వహించారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ద్వాదశ జ్యోతిర్లింగ పడిపూజ, బిల్వాష్టకం, పంచామృత రుద్రాభిషేకం, మంగళహారతులు పూజలను నిర్వహించారు. అనంతరం స్వాములకు, భక్తులకు మహా అన్నదాన ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం నిర్వాహకులు మాజీ జడ్పీటీసీ బాల్ రెడ్డిని ఘనంగా సన్మానించారు.

శివ స్వాముల పడిపూజలో మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి

నిధులు ఖర్చుచేయడం లేదు

జిన్నారం, ఫిబ్రవరి 11 : బడ్జెట్‌లో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధి, సంక్షేమానికి నిధులు కేటాయిస్తున్న ఖర్చుచేయడం లేదని ఆలిండియా సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన జిన్నారంలో బడ్జెట్ కేటాయింపుపై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో సంక్షేమ హాస్టళ్లు, గురుకులాల్లో విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీల పెంపు లేదన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్ ప్లాన్ అమలు కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అసైన్డ్ భూములను లబ్ధిదారుకలు పట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయాల్లో సంవత్సరాలుగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

సేవాలాల్ జయంతికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఎమ్మెల్యే మాణిక్‌రావును ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

జహీరాబాద్, ఫిబ్రవరి 11: సేవాలాల్ మహారాజ్ జయంతికి హాజరుకావాలని జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావును ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. 15న జహీరాబాద్‌లో నిర్వహించే సేవాలాల్ జయంతిని దిగ్విజయంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ప్రేంసింగ్, శ్రీనివాస్ నాయక్‌పవార్, వాసు నాయక్, రామ్‌రాథోడ్, సంజీవ్‌కుమార్, విజయ్‌రాథోడ్, రాజు బనోత్, రవీందర్ చౌహాన్ పాల్గొన్నారు.

యూకే పర్యటనలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, ఫిబ్రవరి 11: పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దంపతులు యూకేలో పర్యటిస్తున్నారు. యునైటెడ్ కింగ్‌డం పరిధిలోని సౌత్ వార్విక్షైర్‌లో ప్రఖ్యాత మోరేటన్ మోరెల్ యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ సైన్స్ కళాశాలను సందర్శించారు. యూనివర్సిటీలో నూతన పంటల సాగు విధానం, వంగడాలపై శాస్త్రవేత్తలను అడిగి తెలుసుకున్నారు. ప్రపంచ ప్రఖ్యాత మేడం టుసాడ్స్ మ్యూజియం,(ప్రముఖుల మైనపు విగ్రహాలు) నేషనల్ మ్యూజియంలను సందర్శించారు.

యూకే పర్యటనలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి దంపతులు

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను తొలిగించాలి

సంగారెడ్డి, ఫిబ్రవరి11: ఉద్యోగాల పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను విధుల నుంచి తొలిగించాలని కార్మికులు, సీఐటీయూ నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సీఐటీయు జిల్లా సహాయకార్యదర్శి యాదగిరి విలేకరులతో మాట్లాడుతూ ఉద్యోగాల పేరుతో అక్రమాలకు పాల్పడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ విజయ్‌బాబును ఉద్యోగం నుంచి తొలిగించాలని, కొంతమంది కార్మికుల స్థానంలో కుటుంబసభ్యులకు అవకాశం ఇవ్వాలన్నారు. తొలిగించిన కార్మికుల స్థానంలో లక్షల రూపాయలు తీసుకొని కొందరికి అవకాశం కల్పిస్తూ అక్రమాలకు పాల్పడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఉద్యోగం నుంచి తొలిగించాలని డిమాండ్ చేశారు. తమ ఇంటి వద్ద పనికి రమ్మని కార్మికులను ఇబ్బంది పెడుతూ పనికి రాకపోతే మీ సంగతి చూస్తానని కార్మికులను బెదిరిస్తున్నాడన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ తప్పులు మున్సిపల్ అధికారులకు తెలియపోవడం దారుణమన్నారు. అతడిని తొలిగించకపోతే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు. నాయకులు తారాసింగ్, పుండరీకం, రాజు, మల్లేశ్ పాల్గొన్నారు.

గుమ్మడిదల ఎస్సై బాధ్యతల స్వీకరణ

మహేశ్వర్‌రెడ్డి

గుమ్మడిదల, ఫిబ్రవరి 11: గుమ్మడిదల ఎస్సైగా మహేశ్వర్‌రెడ్డి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. పటాన్‌చెరు నియోజకర్గంలోని ఇంద్రకరణ్ ఠాణాలో ఎస్సైగా విధులు నిర్వహించిన మహేశ్వర్‌రెడ్డి గుమ్మడిదల ఠాణాకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎస్సైగా విధులు నిర్వహించిన లక్ష్మారెడ్డి జహీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్సై మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ శాంతిభద్రతల విషయంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలు పాల్పిడితే చర్యలు ఉంటాయన్నారు.

నేడు పాతపంటల జాతర ముగింపు

జహీరాబాద్, ఫిబ్రవరి 11: ఝరాసంగం మండలంలోని మాచునూర్ గ్రామ శివారులో ఉన్న డీడీఎస్ పచ్చసాలే ఆవరణలో పాత పంటల జాతర ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తామని డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ మహిళా సభ్యులు తెలిపారు. సోమవారం మాచునూర్ గ్రామంలోని డీడీఎస్ పచ్చసాలే ఆవరణలో ఉదయం 10.30 గంటలకు జాతర నిర్వహిస్తామన్నారు. పాత పంటలతో అలంకరణ చేసిన ఎడ్ల బండ్ల ఊరేగింపు ఉంటుందన్నారు. ముగింపు ఉత్సవాలకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు హాజరవుతారని పేర్కొన్నారు.

14న అక్షరాభ్యాసం

న్యాల్‌కల్, ఫిబ్రవరి 11: మండలంలోని రేజింతల్ సిద్ధివినాయక ఆలయంలో ఈ నెల 14న సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తున్నట్టు ఆలయ ట్రస్టు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ గుప్తా, అల్లాడి నర్సింలు తెలిపారు. వసంత పంచమిని పురస్కరించుకొని తొలిసారిగా ఆలయ ప్రాంగణంలో ఉదయం 9.30 గంటలకు ప్రత్యేక పూజలు చేసి చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల తల్లిదండ్రులు తమ చిన్నారులను తీసుకువచ్చి అక్షరాభ్యాసం చేయించుకోవాలని సూచించారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపనోత్సవాలు

న్యాల్‌కల్, ఫిబ్రవరి 11: మండలంలోని న్యామతాబాద్ గ్రామంలోని ఆంజనేయ స్వామి ఆలయ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవాలను నిర్వహిస్తున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సోమవారం నుంచి 14వ తేదీ వరకు ఆలయంలో విశ్వనందగిరి మహారాజ్, సిద్ధిలింగేశ్వర మహారాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అన్ని ఏర్పాట్లు చేశారు.

దుకాణదారులపై కేసు నమోదు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 11: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు దుకాణదారులపై ఆర్సీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై శశికాంత్‌రెడ్డి కథనం ప్రకారం..ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్ నగర్‌కాలనీలో బెల్ట్ దుకాణాలు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో ఆయా దుకాణాల్లో తనిఖీలు చేశారు. శ్రీనివాస్‌నగర్‌కాలనీ సండే మార్కెట్ వద్ద ఓ పాన్ దుకాణంలో 1.8లీటర్ల మద్యం, కల్లు దుకాణంలో 3.2లీటర్ల మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకొని దుకాణదారులు అశోక్, శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు పాదయాత్ర

పోస్టర్ ఆవిష్కరిస్తున్న పర్యావరణ పరిరక్షణ జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు

సంగారెడ్డి, ఫిబ్రవరి 11: పర్యావరణాన్ని కాపాడుకోవడానికి చలో సీఎం క్యాంపు కార్యాలయం పాదయాత్రను విజయవంతం చేయాలని పర్యావరణ పరిరక్షణ జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతికంగా పరుగులు పెడుతున్న సమాజంలో పర్యావరణానికి తీవ్ర విఘాతం తలెత్తుతుందని, మొక్కలు పెంపకంతోనే పర్యావరణాన్ని పరిరక్షిస్తామన్నారు. అందుకోసం ఈనెల 13 నుంచి 16 వరకు కాలుష్య నిర్మూలనే ధ్యేయంగా సంగారెడ్డి నుంచి సీఎం క్యాంపు కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న కాలుష్యంతో పుట్టే బిడ్డలు కూడా అవిటితనంతో, అంతుచిక్కని రోగాలతో జీవచ్ఛవంలా మారుతున్నారన్నారు. దీనికి కారణం పెరుగుతున్న కాలుష్యమేనని, దానిని అరికట్టకపోతే మానవ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. పాదయాత్రలో పర్యావరణ ప్రేమికులు, విద్యావేత్తలు, పారిశ్రామిక వేత్తలు, రాజకీయ నాయకులు, మహిళామణులు, యువకులు పాల్గొనాలని చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సమావేశంలో గందమాల యాదయ్య, మలేశ్, రాములు, బాలకృష్ణారెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహకం

రాయికోడ్, ఫిబ్రవరి 10: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులకు తన వంతుగా ప్రోత్సాహకం అందిస్తున్నానని వరం వైస్ చైర్మన్ తుకారం కురుమ అన్నారు. అదివారం మండల కేంద్రమైన రాయికోడ్‌లో క్రికెట్ క్రీడాకారులకు అవరమైన ఆట వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సొంత నిధులతో గ్రామంలో అన్ని ఆటలకు సంబంధించిన ఆట వస్తులను అందిస్తానన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో క్రీడకారులకు తన వంతుగా ఆర్థికసాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఆటలతో శరీరక దృఢత్వంతోపాటు మానసిక ప్రశాంతత ఉంటుందన్నారు.

ఆట వస్తువులను అందజేస్తున్న తుకారం కురుమ

హెడ్ కానిస్టేబుల్‌కు ఏఎస్ఐగా ఉద్యోగోన్నతి

ఉద్యోగోన్నతి పొందిన రవీందర్‌గౌడ్‌కు చిహ్నం తొడుగుతున్న డీఎస్పీ

సిర్గాపూర్, ఫిబ్రవరి 11: సిర్గాపూర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సీనియర్ హెడ్ కానిస్టేబుల్ రవీందర్ గౌడ్‌కు ఉద్యోగోన్నతి లభించింది. ఈమేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఆదివారం నారాయణఖేడ్ డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వెంకట్‌రెడ్డి, ఉద్యోగోన్నతి చిహ్నాన్ని యూనిఫాంను రవీందర్‌గౌడ్‌కు అందజేశారు. ఆయనను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

చిత్తశుద్ధి ఉంటే ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

నాగల్‌గిద్ద/మనూర్, ఫిబ్రవరి 11: దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ రాష్ట్రాన్ని పదేండ్లలో అభివృద్ధి చేసింది మాజీ సీఎం కేసీఆర్ మాత్రమేనని నారాయణఖేడ్ మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో మనూర్, నాగల్‌గిద్ద మాజీసర్పంచ్‌లను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రంలో లేని అభివృద్ధి మన రాష్ట్రంలో జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. అమలు చేసే వరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నందుపాటిల్, వైస్ ఎంపీపీ పండరి యాదవ్, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

రామాలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

సిర్గాపూర్, ఫిబ్రవరి 11: చిన్నముబారక్‌పూర్‌లో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈమేరకు శ్రీరాముడి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. నారాయణఖేడ్ మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, ఎంపీపీ జార మహిపాల్‌రెడ్డి, భారత జాగృతి జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు అరుణ్ రాజ్ తదితరుల పాల్గొని ప్రత్యేక పూజలు చేసి, శ్రీరాముడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని, ఘనంగా సన్మానించారు.

ముబారక్‌పూర్‌లో మాజీఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

బీఎంఎస్ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

మహాసభల గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

సంగారెడ్డి, ఫిబ్రవరి 11: భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర మహాసభలు ఈనెల 17,18 తేదీల్లో గోదావరిఖనిలో నిర్వహిస్తున్నట్లు జిల్లా కార్యదర్శి మోహన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని జిల్లా కార్యాలయంలో మహాసభల గోడపత్రికను బీఎంఎస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి పరిష్కారానికి ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. కార్మిక సమస్యలపై తీర్మానాలు చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. భారతీయ మజ్దూర్ సంఘ్ కార్మిక సంక్షేమానికి నిరంతరం పోరాటాలు చేస్తుందని గుర్తుచేశారు. సమావేశంలో మజ్దూర్ సంఘ్ సభ్యులు నర్సింహులు, ప్రభాకర్, నర్సింగ్‌రావు, ప్రసాద్, పెంటయ్య, ఆంజనేయులుతోపాటు బ్లూక్రాఫ్ట్ ఆగ్రో పరిశ్రమ కార్మికులు పాల్గొన్నారు.

సజావుగా ప్రవేశ పరీక్ష

జిన్నారం, ఫిబ్రవరి 11: జిన్నారంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో ఆదివారం 5వ తరగతి ప్రవేశ పరీక్షను నిర్వహించారు. మొత్తం 384 మంది విద్యార్థులకు 354 మంది హాజరయ్యారని ప్రిన్సిపాల్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మొత్తం 30 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

హత్నూరలో..

హత్నూర, ఫిబ్రవరి11: హత్నూరలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన గురుకుల ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగిందని ప్రిన్సిపాల్ సుధాకర్ తెలిపారు. 5వ తరగతిలో చేరేందుకు నిర్వహించిన ప్రవేశపరీక్షకు 408 విద్యార్థులు పరీక్ష రాయాల్సివుండగా 375 మంది పరీక్ష రాయగా 33 మంది గైర్హాజరైనట్లు తెలిపారు.

విద్యార్థులకు అవార్డులు

రామచంద్రాపురం, ఫిబ్రవరి11: తెల్లాపూర్‌లోని మంథన్ ఇంటర్నేషనల్ స్కూల్‌కి చెందిన ముగ్గురు విద్యార్థులు కేంబ్రిడ్జ్ లెర్నర్ అవార్డులు సాధించారని వైస్ ప్రిన్సిపాల్ రుచిక ఉపాధ్యాయ్ తెలిపారు. కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ ఎగ్జామినేషన్ సిరీస్‌లో భాగంగా విద్యార్థులు విహాన్, హిషాన్, హాసిని ప్రతిభ కనబర్చి అవార్డులు సాధించారని చెప్పారు. దేశంలోని అత్యంత గుర్తింపు పొందిన స్కూల్స్‌కి చెందిన విద్యార్థులు ఈ అత్యుత్తమ కేంబ్రిడ్జ్ లెర్నర్ అవార్డుల పరీక్షకు హాజరయ్యారన్నారు. మా స్కూల్‌కి చెందిన ముగ్గురు విద్యార్థులు అవార్డులు సాధించడం గొప్ప విషయమన్నారు.

వాసవీమాతకు ప్రత్యేక పూజలు

సంగారెడ్డి, ఫిబ్రవరి 11: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని ఆదివారం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తోపాజి అనంతకృష్ణ ఆధ్వర్యంలో హోమం, మహిళలు లలిత సహస్ర పారాయణం చదివి సామూహిక కుంకుమార్చనలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి జూలకంటి మల్లేశం, కార్యనిర్వహక కార్యదర్శి విద్యాసాగర్, సభ్యులు నామ భాస్కర్, శ్రీనివాస్, నరేంద్ర, బుచ్చిలింగం, రవీందర్, మహిళాసభ్యులు తోపాజి తేజావతి, కటకం నాగలక్ష్మి, ఆమెటి మాలతిలతోపాటు మహిళా భక్తులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆత్మార్పణ హోమం చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కల్హేర్‌లో..

కల్హేర్, ఫిబ్రవరి 11: మాసన్‌పల్లిలోని శివాలయంలో వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినాన్ని ఆదివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆర్యవైశ్యులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు చంద్రమోహన్, హనుమాన్లు, భాస్కర్‌గుప్తా, పర్వయ్య, వెంకటేశం పాల్గొన్నారు.

గొల్లకుంట శిఖం కబ్జా

- బఫర్ జోన్, శిఖం మట్టితో పూడ్చివేత
- ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసిన రైతులు
- అధికారుల ఆదేశాలు బేఖాతర్
- హద్దులు నిర్ధారించి మట్టిని తొలిగించాలని చెప్పినా పట్టింపు లేదు
- కుంటను కాపాడాలని రైతులు, మత్స్య సహకార సంఘం సభ్యుల ఆందోళన

గొల్లకుంట శిఖంలో అధికారులు నిర్ధారించిన హద్దుల్లో కొంతమేర తొలిగించిన మట్టి

జిన్నారం, ఫిబ్రవరి 11 : కొడకంచి పంచాయతీ పుట్టగూడ గ్రామ శివారులోని గొల్లకుంట కబ్జాకు గురవుతోంది. పట్టా భూమి చదును పేరుతో పొలానికి ఆనుకొని ఉన్న గొల్లకుంట శిఖాన్ని మట్టితో నింపుతున్నారు. పుట్టగూడ గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 216లో శిఖం, బఫర్ జోన్లతో కలిపి సుమారు. 7.2 ఎకరాల్లో గొల్లకుంట ఉంది. కుంటకు సంబంధించి